

సిటీ సివిల్ కోర్టులో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి పీఎస్ నర్సింహ

## మధ్యవర్తిత్వమే శ్రేయస్కరం

చార్మినార్, డిసెంబర్ 23: కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వమే శ్రేయస్కరమని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ తెలిపారు. శనివారం సిటీ సివిల్ కోర్టు ఆవరణలో సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎం.ఎల్ రామకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైట్ ఆఫ్ మీడియేషన్ 2020 సదస్సును హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుక యారాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి పీఎస్ నర్సింహ మాట్లాడుతూ న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కే కక్షిదారులు ఏ విషయంలో న్యాయ సహాయం కోసం వస్తున్నారో కేసు పరిశీలిస్తున్న న్యాయమూర్తులు ఒకసారి ఆలోచించాలన్నారు. సిటీ సివిల్ కోర్టుతో పాటు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలోనూ మీడియేషన్ కేంద్రాలు కొనసాగుతున్నాయని, కక్షిదారులు కేసుల పరిష్కారం కోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంఎస్ తిరుమల్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామానంద తీర్థలో పీవీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం చిన్నారులతో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు

## పీవీ సేవలు చిరస్మరణీయం

బేగంపేట్, డిసెంబర్ 23: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సేవలు చిరస్మరణీయమని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. పీవీ నర్సింహా రావు వర్ధంతి సందర్భంగా బేగంపేట్ బ్రాహ్మణవాడిలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో పీవీ విగ్రహానికి ఎమ్మెల్సీ వాణీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవీకి పిల్లలంటే ఇష్టమని, సాంకేతిక పరిజ్ఞానం పిల్లలకు అందుబాటులోకి రావాలని ఎన్నో ప్రణాళికలు అమలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పీవీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సురభి సోలార్ ఎనర్జీ డైరెక్టర్ శేఖర్ మారంరాజు, అజిత, పీవీ ప్రభాకర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ వాసుకి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పీవీ జ్ఞానభూమిలో పీవీ సమాధి వద్ద సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశామని ఎమ్మెల్సీ వాణీదేవి తెలిపారు.

## గ్రాడ్యుయేట్లకు మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ

రవీంద్రభారతి, డిసెంబర్ 23: సమస్యలను సామరస్యంగా పరిష్కరించడం, మరియు కేసుల పరిష్కారం వేగవంతం చేయడంలో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యత చాలా విలువైనదని లండన్‌కు చెందిన రాండాన్స్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రేణురాజ్, ఆశ్రా వ్యవస్థాపకుడు మహమ్మద్ సుల్తాన్ అలీ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... హైదరాబాద్ వేదికగా ఏర్పాటైన ఆసరా మధ్యవర్తిత్వ కేంద్రం, యూకేలోని రాండాన్స్ లిమిటెడ్ మధ్యవర్తిత్వ కేంద్రంతో ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 18, 19వ తేదీల్లో లండన్‌లోనే హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఐదు రోజుల పాటు ఔత్సాహిక గ్రాడ్యుయేట్లకు 40 గంటల శిక్షణ అందించనున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో హైకోర్టు న్యాయవాదులు జి.హరికుమార్, తెలంగాణ రాష్ట్ర లీగల్ కోఆర్డినేటర్లు (ఆశ్రా) తెలంగాణ అధ్యక్షుడు వెంకటేశ్‌గుప్త పాల్గొన్నారు.

### విద్యుత్ బకాయి వసూలుకు వెళ్లిన లైన్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

మెహిదీపట్నం, డిసెంబర్ 23 : విద్యుత్ బకాయిలను వసూలు చేయడానికి వెళ్లిన లైన్ ఇన్‌స్పెక్టర్‌పై వినియోగదారుడు దాడి చేసి తీవ్రంగా కొట్టిన ఘటన మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెహిదీపట్నం విద్యుత్ ఏడీ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో లక్ష్మీనారాయణ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అహ్మద్‌నగర్ ఫస్టలాన్సర్‌లో శనివారం విద్యుత్ బకాయిలు వసూలు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఓ వినియోగదారుడు లక్ష్మీనారాయణపై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆయన వెంటనే డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీ మల్లేశ్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత మాసాబ్‌ట్యాంక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

# చట్ట ప్రకారం పని చేద్దాం

- అధికారుల తీరుపై ఎప్పటికప్పుడు పరిశీలన
- డ్రగ్స్ వాడినట్లు ఆధారాలుంటే చర్యలే..
- ఆర్థిక నేరాలు, భూ వివాదాలు ఎక్కువే
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు
- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి



వార్షిక నివేదికను విడుదల చేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఇతర అధికారులు

సిటీబ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): సైబరాబాద్‌లో 7 శాతం నేరాలు పెరిగాయని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి ఫిర్యాదులు తీసుకొని ఎవరు చేసే పని వారు చట్ట ప్రకారం చేస్తూ కేసుల దర్యాప్తును పారదర్శకంగా చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ 2023 వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... గత ఏడాది 27,322 కేసులు నమోదవగా 2023లో 29,156 కేసులు నమోదయ్యాయన్నారు. ఆస్తుల రికవరీలో 9 శాతం పెరుగుదల ఉందని వెల్లడించారు. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు. 3432 కేసులలో నిందితులకు న్యాయస్థానాలు ఆయా కేసుల్లో జైలు శిక్షలు విధించాయని వివరించారు. సైబర్ నేరాలు ప్రతి యేడు పెరుగుతున్నాయని, అలాగే ఈ సంవత్సరం కూడా పెరిగాయని సైబర్‌నేరాల్లో పోయిన సొమ్ము విలువ రూ. 232.34 కోట్లు ఉండగా రూ. 46 కోట్లు రికవరీ చేశారని వెల్లడించారు. ట్రాఫిక్ విషయంలో ఎప్పకటిప్పుడు చర్యలు తీసుకోవాలని, అన్ని విభాగాల సమన్వయంతో మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఆర్థిక నేరాలు, భూ సంబంధిత నేరాలకు సంబంధించిన కేసులు ఎక్కువగా ఉంటున్నాయని, వీటిపై ఎప్పకటిప్పుడు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

### అధికారుల పనితీరుపై వాచ్..!

చట్ట ప్రకారం ఎవరి పని వాళ్లు చేస్తూ వెళ్లాల్సిన అవసరముందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ స్థాయిలో సమస్యను పట్టించుకోలేదంటే ఏసీపీ, అదనపు డీసీపీ, డీసీపీలకు ఫిర్యాదు చేయాలని అక్కడ కూడా పరిష్కారం కాకపోతే తన వద్దకు సామాన్య ప్రజలు రావచ్చని సూచించారు. అధికారుల పనితీరుపై ఎప్పకటిప్పుడు పరిశీలన ఉంటుందన్నారు. పైరవీలతో పోస్టింగ్‌లు ఉండవని, పనితీరు ఆధారంగానే పోస్టింగ్‌లు ఉంటాయని తెలిపారు. డ్రగ్స్ కేసులలో డ్రగ్స్ వాడినట్లు ఆధారాలుంటే చర్యలు తీసుకుంటామని, ఎన్డీపీఎస్ యాక్ట్‌లో అది ఉందని, దానిని అమలు చేస్తామన్నారు. డ్రగ్ పెడ్లర్స్, డ్రగ్స్ తయారీదారులతో పాటు వినియోగదారులపై నిఘా కొనసాగుతుందన్నారు. న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించే వారు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు వేడుకలు ముగించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు శబరీష్, శ్రీనివాస్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

| క్రైమ్ వివరాలు | 2022 | 2023 |
|---|---|---|
| రిపోర్టయిన కేసులు | 27,322 | 29,156 |
| ఆస్తి సంబంధిత నేరాలు | 3435 | 2904 |
| ఆస్తి సంబంధిత నేరాల్లో డిటెక్షన్ | 2013 | 1845 |
| పోయిన సొత్తు విలువ | రూ. 24,10,35,971 | రూ. 24,90,27,844 |
| రికవరీ | రూ. 15,13,26,294 | రూ.17,91,87,648 |
| మహిళలపై జరిగిన నేరాలు | 2489 | 2356 |
| ఎస్సీ/ఎస్టీ కేసులు | 158 | 133 |
| రోడ్డు ప్రమాదాలు | 3224 | 3143 |
| సైబర్ నేరాలు | 4850 | 5342 |
| సైబర్‌నేరాల్లో పోయిన సొత్తు | రూ.66,66,55,124 | రూ.232,34,84,557 |
| సైబర్‌నేరాల్లో రికవరీ చేసిన మొత్తం | రూ. 7,57,94,476 | రూ.46,00,37,222 |



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

# అవుట్‌డోర్ ఈవెంట్లలో డీజేలకు అనుమతి లేదు

- డ్రగ్స్‌పై పటిష్ట నిఘా
- పక్కాగా నిబంధనలు పాటించాలి
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేడుకల్లో అవుట్ డోర్ ఈవెంట్లలో డీజేలకు అనుమతి లేదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లు, ఫామ్ హౌస్, వైన్ షాప్, ఈవెంట్ నిర్వాహకులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలందరు బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. ట్రాఫిక్, ఎస్‌వోటీ, పెట్రోలింగ్ బృందాలతో పాటు మహిళలపై వేధింపులు నిరోధించేందుకు షీ టీమ్ బృందాలు కూడా విధి నిర్వహణలో ఉంటాయని తెలిపారు. వేడుకల్లో డ్రగ్స్ వినియోగానికి తావు లేకుండా నిర్వాహకులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత సమయానికి అన్ని మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే ఆయా దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు విస్తృతంగా ఉంటాయని, నిర్లక్ష్యంగా, వేగంగా వాహనాలు నడుపొద్దని, తాత్కాలికంగా ఫ్లై ఓవర్లు మూసివేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజేశ్ చంద్ర, శ్రీనివాస్, సాయి శ్రీ, జానకి, ఇందిరా గిరిధర్, మురళీధర్, అధికారులు పాల్గొన్నారు.

### 30న మెగా జాతీయ లోక్ అదాలత్

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల ప్రకారం మెగా జాతీయ లోక్‌అదాలత్‌ను ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.గోవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల కోర్టుల్లో నమోదైన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

### కల్తీ వైన్ తయారీ దారుల అరెస్ట్

కవాడిగూడ, డిసెంబర్ 23: కల్తీ వైన్ తయారు చేస్తున్న ఇద్దరి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం...తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన ఎర్నాల్డ్ మిల్స్(50) వృత్తి రీత్యా డ్రైవర్. గెరాల్డిన్ (54) గృహిణి. వీరిద్దరూ అక్కా తమ్ముడు. కొన్ని రోజులుగా వారి ఇంట్లోనే వివిధ రకాల పండ్లను నిల్వ ఉంచి వైన్‌ను తయారు చేసి లీటర్ బాటిల్ రూ. 350 చొప్పున విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వారి ఇంటిపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి 360 బాటిల్స్‌లో నిల్వచేసిన వైన్స్‌ను సీజ్ చేసి, నిందితులు ఎర్నాల్డ్ మిల్స్, గెరాల్డిన్‌ను అరెస్ట్ చేశారు.